క్లుప్తంగా

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు



విస్సన్నపేట: స్థానిక షిర్డీ సాయిబాబా సేవా మందిరంలో సాయిబాబా పుణ్యతిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి భజన, నగర సంకీర్తన, అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

విస్సన్నపేట: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 7వ తేదీన విజయవాడలో ధర్నా నిర్వహించనున్నామని ఉపాధ్యాయ సంఘ నాయకులు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



తిరువూరు: గానుగపాడులోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు ప్రవాసాంధ్రుడు మందడపు నరేంద్ర ప్రింటర్‌ను వితరణగా ఇచ్చారు. పాఠశాల విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే విధంగా గతంలో దాతలు కంప్యూటర్ వితరణ ఇవ్వగా నరేంద్ర ప్రింటర్ అందజేశారని ప్రధానోపాధ్యాయిని విక్టోరియా చెప్పారు.

వెండి కవచం, తొడుగులు సమర్పణ



చాట్రాయి: ఆరుగొలనుపేటలోని అంకమ్మ మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు హైదరాబాద్‌కు చెందిన వల్లేటి నరసింహారావు, లలిత దంపతులు రూ.2.50 లక్షల విలువ గల వెండి కవచం, తొడుగులను గురువారం బహుకరించారు. అనంతరం అమ్మవార్లకు పూజలు చేశారు.

జీఎస్టీపై అవగాహనా ర్యాలీ

ముసునూరు: వస్తువులు, సేవల పన్నుల తగ్గింపుతో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ట్రాక్టర్లతో జీఎస్టీ తగ్గింపుపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

శిథిలావస్థలో వంతెన.. ప్రయాణానికి అవస్థలు

- వంతెనపై లేచిపోయిన కాంక్రీటు
- బయటకు కనిపిస్తున్న ఇనుప చువ్వలు, బద్దెలు
- నిత్యం ప్రమాదాలతో వాహన చోదకుల నరకయాతన
- ప్రమాదకరంగా వెలగలేరు వద్ద వంతెన



వెలగలేరు వద్ద గుంతలతో ప్రమాదకరంగా ఉన్న వంతెన



వంతెనపై గడ్డి పెరిగి నిలిచిపోయిన వర్షం నీరు



వంతెనపై ప్రమాదకరంగా ఉన్న ఇనుప చువ్వలు, బద్దెలు

జి.కొండూరు: పోలవరం కుడికాలువపై వెలగలేరు వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. కాంక్రీటు లేచిపోయి ఇనుక చువ్వలు, బద్దెలు బయటకు చొచ్చుకువచ్చాయి. ఇవి వాహన చోదకుల పాలిట శాపంగా మారుతున్నాయి. వర్షం నీరు వంతెనపై నిలుస్తోంది. నిత్యం ప్రమాదాలకు నిలయంగా ఈ వంతెన మారింది.

నిత్యం ప్రమాదాలే..

విజయవాడ–విసన్నపేట రహదారిలో జి.కొండూరు మండల పరిధి వెలగలేరు గ్రామ శివారులో పోలవరం కుడి కాలువపై ఉన్న హైలెవెల్ వంతెన నిత్యం ప్రమాదాలతో ఆందోళన కలిగిస్తోంది. ఈ వంతెనపై కాంక్రీటు మొత్తం పెచ్చులుగా లేచిపోయి ఇనుప చువ్వలు, బద్దెలు దర్శనమిస్తున్నాయి. అంతే కాకుండా వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ వెంట మట్టి చేరి భారీగా గడ్డి పెరగడంతో వర్షం పడినప్పుడు వంతెనపై నీరు కిందకు వచ్చే అవకాశం లేక రోజుల తరబడి వంతెనపైనే నిలిచిపోతోంది. ఈ క్రమంలో వంతెనపై ఉన్న గుంతలు కనిపించక, ఇనుప సువ్వలు, బద్దెలు వాహనాలకు తగిలి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత కొంతకాలంగా ఇదే తీరు కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పుష్కర కాలం గడవకమందే ధ్వంసం

వెలగలేరు వద్ద పోలవరం కుడి కాలువపై గతంలో నిర్మించిన లో లెవెల్ వంతెనను తొలగించి 2014–19 మధ్యకాలంలో హై లెవెల్ వంతెనను నిర్మించారు. పుష్కర కాలం కూడా పూర్తి కాక ముందే ఈ వంతెన శ్లాబు పై భాగంలో పెచ్చులు లేచిపోయి లోతైన గుంతలు ఏర్పడటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అప్పటి జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడే ఈ వంతెన నిర్మాణం జరిగినప్పటికీ నాణ్యతా ప్రమాణాలు లోపించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం రద్దీగా..

వాహనాల రాకపోకలతో ఈ వంతెన నిత్యం రద్దీగా ఉంటోంది. విజయవాడ వైపు నుంచి వెలగలేరు, గణపవరం మీదుగా మైలవరం, విస్సన్నపేట వెళ్లేందుకు ఇది ప్రధాన రహదారి. అంతే కాకుండా హైదరాబాద్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు విజయవాడలోకి వెళ్లకుండా ఇబ్రహీంపట్నం నుంచి జి.కొండూరు, కందులపాడు, ఈ వంతెన మీదుగా వెలగలేరు, విజయవాడ వెస్ట్ బైపాస్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అంతే కాకుండా ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, వెలగలేరు గ్రామాలలోని క్వారీలు, క్రషర్ల నుంచి మెటల్, గ్రావెల్‌ను తరలించేందుకు వందలాది వాహనాలు ఈ వంతెన మీదుగా వెళ్తుంటాయి. ఈ క్రమంలో వంతెన ప్రమాదకరంగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరిగి వాహన చోదకులు క్షతగాత్రులుగా మారుతున్నారు.

గుంతలను పూడ్చాలి



మా గ్రామం వద్ద వంతెనపై ఏర్పడిన గుంతల వల్లన నేను నా బైకుపై నుంచి కింద పడ్డాను. కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కొంచెం అయితే ప్రాణం పోయేది. వంతెనపై గుంతలు పడ్డాయి. అధికారులు వెంటనే స్పందించి గుంతలను కాంక్రీటుతో పూడ్చాలి.

– చల్లగుండ్ల శ్రీనివాసరావు, గ్రామస్తుడు, వెలగలేరు

ప్రమాదాలు జరుగుతున్నాయి



మా గ్రామాన్ని ఆనుకొని పోలవరం కుడి కాలువపై ఉన్న వంతెనపై కాంక్రీటు పెచ్చులు లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. శ్లాబు చువ్వలు, జాయింట్ల వద్ద బద్దెలు పైకి లేచి బైకులపై వెళ్లే వాళ్లు కింద పడుతున్నారు. ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి కాంక్రీటుతో మరమ్మతులు చేయాలి.

– నారాయణపరపు ప్రసాద్, గ్రామస్తుడు, వెలగలేరు

మరమ్మతులు చేయాలి



మా గ్రామం వద్ద పోలవరం కుడి కాల్వపై ఉన్న వంతెన పదేళ్లు కూడా గడవకముందే దారుణంగా మారింది. వంతెనపై గుంతలు ఏర్పడటం అంటే ఎంత నాణ్యతతో కట్టారో అర్థమవుతుంది. వంతెన పైన గోడల పక్కన గడ్డి పెరిగి నీరు కూడా కిందకు పోవడంలేదు. వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– గంజి దేవమాతరావు, గ్రామస్తుడు, వెలగలేరు

వైభవంగా ముగిసిన దసరా ఉత్సవాలు



పవిత్ర సంగమం వద్ద హంస వాహనంపై విహరిస్తున్న అమ్మవారు



నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శమీ పూజ



నూజివీడు పట్టణంలో ప్రజలతో కిక్కిరిసిన రోడ్లు



రాజరాజేశ్వరిదేవిగా కోట మహిషమ్మ



ఆయుధ పూజ నిర్వహిస్తున్న మేకా మెహర్‌రామ్ వెంకటాద్రి అప్పారావు, మంత్రి పార్థసారథి

ఇబ్రహీంపట్నం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. దసరా వేడుకల్లో భాగంగా 11 రోజుల పాటు 11 అలంకారాలలో దుర్గమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. విజయదశమి రోజున రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కొటికలపూడి, మూలపాడు, జూపూడి, కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వేడుకలు జరిగాయి. చివరి రోజు పూర్ణాహుతితో వేడుకలు ముగిశాయి.

శోభాయమానంగా తెప్పోత్సవం

కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో పవిత్ర సంగమం వద్ద శరన్నవరాత్రి వేడుకలతో పాటు విజయనర్తనం సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశాయి. కృష్ణానదిలో అమ్మవారికి తెప్పోత్సవం శోభాయమానంగా జరిగింది. హంసవాహనంపై రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు నదిలో విహరించారు. అనంతరం కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

- **తిరువూరు:** నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా, పర్వతవర్ధనిగా అలంకరించి పూజాదికాలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా శమీపూజ చేసి అమ్మవారి విగ్రహాలను ఊరేగించారు.
- **విస్సన్నపేట:** స్థానిక ద్వారకా నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. విజయ దశమి సందర్భంగా గురువారం రాత్రి శమీపూజ, ప్రత్యేక పూజలు జరిగాయి. తాతకుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు.
- **నూజివీడు:** నూజివీడులో మహిషమ్మ అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. హంసవాహనంపై ఊరేగుతూ వచ్చిన మహిషమ్మను పట్టణ ప్రజలు దర్శించుకున్నారు. స్థానిక ఉయ్యూరు ఎస్టేట్‌లో జమిందారీ వారసులైన మేకా మెహర్‌రామ్ వెంకటాద్రి అప్పారావుతో పాటు మంత్రి కొలుసు పార్థసారథి ఆయుధపూజ నిర్వహించారు. అనంతరం జమ్మికొట్టి తుపాకీ పేల్చి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రారంభమైన ఊరేగింపు కోట మహిషాసురమర్దిని ఆలయం వద్దకు చేరుకుని, అక్కడి నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా తెల్లవార్లు సాగింది. స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షులు రామిశెట్టి మురళీకృష్ణ, ఫెస్టివల్ కమిటీ సెక్రటరీ పగడాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఊరేగింపును తిలకించేందుకు వచ్చిన ప్రజలతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. కోట మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి రాత్రి వరకూ క్యూలైన్లు కిక్కిరిశాయి. రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మ దర్శనమిచ్చారు. డీఎస్పీ ఆధ్వర్యంలో కోట మహిషాసురమర్దిని ఆలయంలో ఆయుధ పూజ నిర్వహించారు.
- **చాట్రాయి:** మండలంలోని ప్రజలు దసరా పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో డీజే సౌండ్‌తో రంగుల చిమ్ముకుంటూ స్థానిక చెరువుల్లో అర్ధరాత్రి నిమజ్జనం చేశారు.
- **ఆగిరిపల్లి:** స్థానిక రుద్రభూమి వద్ద కనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వద్ద ఐదు వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆగిరిపల్లిలోని రజక వీధిలో, తోటపల్లిలో ఉత్సవాలు జరిగాయి. వట్టిగుడిపాడులో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.
- **బలివే(ముసునూరు):** బలివేలోని బలే రామలింగేశ్వర స్వామి ఆలయంతోపాటు మండలంలోని ఆలయాల్లో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో పూజలందుకున్నారు.

అహింసా మార్గంలో పయనించాలి



నూజివీడులో నివాళులర్పిస్తున్న ప్రతాప్ అప్పారావు



తిరువూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

నూజివీడు: మహాత్మాగాంధీ అవలంబించిన అహింసా మార్గంలో పయనించాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం గాంధీజీ చిత్రపటానికి ప్రతాప్ పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు పిల్లా చరణ్, అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, పత్తిపాటి జోజి, యర్రంశెట్టి రవితేజ, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ, శాస్త్రీకి నివాళి

తిరువూరు: జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీల జయంతి కార్యక్రమం గురువారం తిరువూరులో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గాంధీజీ, శాస్త్రీ చిత్రపటాలకు నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, నాయకులు పాపారావు, గజ్జల సీతారామారావు, యరదేశి రామారావు, ఇనపనూరి రవి, కాలసాని గోపాల నాగేశ్వరరావు, పాలం గోపాలరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. తిరువూరు కాంగ్రెస్ కార్యాలయం, లయన్స్ క్లబ్, నగర పంచాయతీ కార్యాలయం, ఐడియాస్ సేవా సంస్థ కార్యాలయాల్లో, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో, ఎ.కొండూరు మండలం కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహాత్మాగాంధీ జయంతిని నిర్వహించారు.

- **విస్సన్నపేట:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి ఆర్ఐ సుజాత, కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి.

6న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

నూజివీడు: కార్మిక వర్గాలకు వ్యతిరేకంగా చంద్రబాబు పని గంటలు పెంచుతూ అసెంబ్లీలో తెచ్చిన చట్ట సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6వ తేదీన నూజివీడులోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. హరినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

బతుకమ్మ సందడి



చాట్రాయి: తెలంగాణ సంస్కృతిలో భాగంగా నిర్వహించే బతుకమ్మ పండుగను గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మకు ఇష్టమైన తంగేడు పూలతో తయారు చేసిన సజ్జను మహిళలు తలపై పెట్టుకుని బ్యాండు మేళాలతో గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు.

జీఎస్టీపై ఆక్వా రైతులకు అవగాహన

మైలవరం: జీఎస్టీపై ఆక్వా రైతులకు అవగాహన కార్యక్రమం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మైలవరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా మత్స్యశాఖాధికారి సీఎస్ చక్రాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన జీఎస్టీతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రవి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండలోని 65వ నంబర్ జాతీయ రహదారి నుంచి సీబీఆర్ స్పోర్ట్స్ అకాడమి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం భూమి పూజ చేశారు. రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, సర్పంచి నెలకుర్తి ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ నాటికగా 'నల్లతాచు నీడలో'

జి.కొండూరు: గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన వీణా అవార్డ్స్ నాటకోత్సవాలలో వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ సంస్థ ప్రదర్శించిన 'నల్లతాచు నీడలో' నాటకానికి ఉత్తమ నాటక ప్రదర్శన అవార్డుతో పాటు నటన విభాగంలో మరో మూడు అవార్డులు లభించాయని నాటక రచయిత, డైరెక్టర్ పోలుదాసు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ నాటిక ప్రదర్శన, ఉత్తమ నటిగా సురభి లలిత, ఉత్తమ ప్రతి నాయకురాలిగా షణ్ముఖి నాగుమంత్రి, ఉత్తమ యువ నటుడిగా పవన్ కల్యాణ్ అవార్డులు అందుకున్నారని చెప్పారు.

ఎస్‌జీటీలకు ప్రమోషన్స్ ఇవ్వాలి

నూజివీడు: డీఎస్సీ–2025లో ఎంపికైన వారికి పోస్టింగ్స్ ఇవ్వడానికి ముందే ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించి ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని సెకండరీ గ్రేడ్ టీచర్ ఫెడరేషన్ (ఎస్‌జీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెరగడ్డ సత్యం శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. 30 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసినా కూడా ప్రమోషన్స్ రాకుండా అదే కేటగిరీలో సర్వీస్ చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ ఇచ్చిన తరువాతే ఎంపికైన వారికి నియామకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాలుష్యం కోరల నుంచి కాపాడాలని వినతి

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యం నుంచి తుమ్మలపాలెం గ్రామ ప్రజలను కాపాడాలని స్థానికులు, లారీ ఓనర్లు విజ్ఞప్తి చేశారు. తుమ్మలపాలెం గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామసభలో సర్పంచి బొమ్ము వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు పంచాయతీ ద్వారా పంపాలని వారు కోరారు. గ్రామస్తులు మాట్లాడుతూ 1979లో ఎన్టీటీపీఎస్ స్థాపించిన సమయంలో ఉద్యోగాలు వస్తాయనే ఆశతో తమ పూర్వీకులు సంస్థకు అతి తక్కువ ధరకు భూములు ఇచ్చారన్నారు. ఉపాధి మార్గాలు చూపకపోగా గ్రామాలన్నీ కాలుష్యంతో నిండి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని చెప్పారు. సంస్థ అధికారుల సూచనల మేరకు గ్రామంలో కొందరు లారీలు కొనుగోలు చేసి బూడిద రవాణాతో ఉపాధి పొందుతున్నారన్నారు. ఇప్పుడు బూడిద కూడా ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టి లారీ లోడింగ్ రూ.3 వేలు చేసి ఓనర్ల పొట్ట కొట్టారని వాపోయారు. కాలుష్య బాధిత గ్రామాల లారీలకు బూడిద ఉచితంగా లోడింగ్ చేయాలని కోరారు.